₹2,357 కోట్లు

పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు నిధులు తగ్గాయి. గత బడ్జెట్‌లో ఈ శాఖకు రూ.2,922.12 కోట్లు కేటాయించగా, ఇప్పుడు రూ.2,357.14 కోట్లు కేటాయించారు.

బడ్జెట్ 2024-25

కేంద్రంలో మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంగా బడ్జెట్ ప్రవేశపెట్టింది. దేశీయ ఉత్పత్తిని పెంపొందించేందుకు మధ్య, ఎగువ మధ్యతరగతి వారికి పన్ను ఆదా ప్రకటించింది. వీధి వ్యాపారుల నుంచి మొదలు రైతులు, పారిశ్రామికవేత్తల వరకు అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చేలా బడ్జెట్ రూపొందించింది. పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం కల్పించేలా స్లాబ్‌లను మార్చింది.

-కిషన్‌రెడ్డి, కేంద్రమంత్రి

పీఎం ప్యాకేజీ!

- నిరుద్యోగిత రేటు పెరుగుతున్న వేళ కేంద్రం నుంచి మూడు కీలక స్కీమ్‌లు
- ఉద్యోగులతో పాటు యాజమాన్యాలకూ ఊరటనిచ్చేలా పలు ఉద్దీపన చర్యలు
- ప్యాకేజీ కింద మరికొన్ని స్కీమ్‌లు కూడా..

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల వేళ నిరుద్యోగ అంశం కీలక పాత్ర పోషించడంతో కేంద్రంలోని ఎన్డీయే సర్కారు బడ్జెట్‌లో రూటు మార్చింది. ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధిపై ప్రధానంగా దృష్టి పెట్టింది. ఈ మేరకు బడ్జెట్‌లో 'ప్రధానమంత్రి ప్యాకేజీ' పేరిట మూడు కీలక పథకాలతో పాటు మరికొన్ని స్కీమ్‌లను ప్రవేశపెట్టింది. ఉద్యోగులతో పాటు యాజమాన్యాలకూ ఉపశమనాన్నిచ్చే ప్రకటనలు చేసింది.

స్కీమ్-1: కొత్త ఉద్యోగులకు నెల వేతనం

సంఘటిత రంగంలో తొలిసారి ఉద్యోగంలో చేరేవారికి ఒక నెల వేతనాన్ని అందించనున్నట్టు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రత్యక్ష నగదు బదిలీ పథకం కింద గరిష్ఠంగా రూ.15 వేల వరకు మూడు వాయిదాల్లో దీన్ని చెల్లించనున్నారు. 2.1 కోట్ల మందికి లబ్ధి చేకూర్చవచ్చని భావిస్తున్నారు.

స్కీమ్-2: తయారీ రంగంలో కొలువులు

తయారీ రంగంలో అదనపు ఉపాధి కల్పనే లక్ష్యంగా రెండో పథకాన్ని తీసుకొచ్చారు. తొలిసారి ఉద్యోగాల్లో చేరినవారితో పాటు అదనపు ఉద్యోగాలు కల్పించే యాజమాన్యాలకు ఉద్యోగుల భవిష్యనిధి కంట్రిబ్యూషన్ (ఈపీఎఫ్‌వో) ద్వారా నాలుగేండ్ల పాటు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందజేయనున్నారు. గరిష్ఠంగా రూ.లక్ష వేతనం ఉన్నవారికి దీన్ని వర్తింపజేస్తామన్నారు. దాదాపు 30 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు.

స్కీమ్-3: యాజమాన్యాలకూ లబ్ధి

కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారికి సంబంధించి యాజమాన్యాలకు రెండేండ్ల పాటు రూ.3,000 వరకు ఈపీఎఫ్‌ఓ కంట్రిబ్యూషన్‌ను కేంద్రం రీయంబర్స్ చేస్తుంది. ఈ పథకం వల్ల 50 లక్షల ఉద్యోగాలు కొత్తగా వస్తాయని భావిస్తున్నారు.

టాప్-500 కంపెనీల్లో కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్

పీఎం ప్యాకేజీలోని మూడు పథకాలతో పాటు యువతలో నైపుణ్యాల మెరుగుకు, ఉద్యోగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికి కేంద్రం మరికొన్ని ప్రత్యేక పథకాలను, కార్యక్రమాలను ప్రతిపాదించింది. మోడల్ స్కిల్ లోన్ కింద రూ.7.5 లక్షల వరకు రుణాలకు ప్రభుత్వ ప్రాయోజిత ఫండ్ ద్వారా పూచీకత్తు ఇస్తామని కేంద్రం తెలిపింది. దీని వల్ల ఏటా 25,000 మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని ఆశాభావం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమల సహకారంతో ఐదేండ్ల వ్యవధిలో 20 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణనివ్వనున్నట్టు వెల్లడించింది. రానున్న ఐదేండ్లలో దేశంలోని టాప్ 500 కంపెనీల్లో కోటిమంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించనున్నట్టు వెల్లడించింది. అలాగే, ఇంటర్న్‌షిప్ భత్యం కింద నెలకు రూ. 5 వేల చొప్పున అందజేయనున్నట్టు వివరించింది. ఒకదఫాలో మరో రూ. 6 వేలు ఇవ్వనున్నట్టు వివరించింది. పరిశ్రమల సహకారంతో మహిళా ఉద్యోగులకు ప్రత్యేక హాస్టళ్లు, శిశు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించింది. అలాగే మహిళల కోసం పరిశ్రమల భాగస్వామ్యంతో ప్రత్యేక నైపుణ్య కార్యక్రమాలను చేపడతామని తెలిపింది.

దివ్యాంగులకు 1,225 కోట్లు

- అసంతృప్తి వ్యక్తం చేసిన హక్కుల సంస్థలు

న్యూఢిల్లీ: దివ్యాంగులకు గతంలో కన్నా ఈసారి స్వల్పంగా బడ్జెట్ పెంచారు. వికలాంగుల సాధికారిత విభాగం (డీఈపీడబ్ల్యూడీ)కు ఈ బడ్జెట్‌లో 1,225.27 కోట్లను కేటాయించారు. గతంలో కేటాయించిన 1,225.01 కోట్ల కన్నా అతి స్వల్పంగా 0.02 శాతం మాత్రమే అధికం. కేంద్ర నిధుల కేటాయింపుపై వికలాంగ హక్కుల సంస్థలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఒక పక్క సమ్మిళిత వృద్ధని ప్రభుత్వం పేర్కొంటునప్పటికీ దివ్యాంగులు నిరంతరాయంగా నిర్లక్ష్యానికి గురవుతున్నారని పేర్కొన్నాయి. దివ్యాంగ హక్కుల సంస్థలు డిమాండ్ చేసిన దానికన్నా బడ్జెట్‌లో కేటాయించినది 5% తక్కువని నేషనల్ ప్లాట్‌ఫామ్ ఫర్ ద రైట్స్ ఆఫ్ ద డిజేబుల్డ్ (ఎన్‌సీఆర్‌డీ) కార్యదర్శి మురళీధరన్ తెలిపారు. అలాగే దివ్యాంగుల విద్య, పునరావాస కార్యక్రమాలలో ప్రధాన పాత్ర పోషిస్తున్న జాతీయ సంస్థలు, రిహాబిలేషన్ కౌన్సిల్ లాంటి స్వతంత్ర సంస్థలకు మద్దతును తగ్గించారని అన్నారు. దివ్యాంగ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను కూడా తగ్గించారని, దీంతో డ్రాపౌట్లు పెరుగుతాయని పేర్కొన్నారు.

కేంద్ర మంత్రులు, ప్రభుత్వ అతిథులకు 1,248 కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర మంత్రుల జీతాలు, క్యాబినెట్ సచివాలయం, ప్రధానమంత్రి కార్యాలయం ఖర్చులు, ప్రభుత్వ అతిథుల సౌకర్యాల కోసం కేంద్ర బడ్జెట్‌లో రూ.1,248.91 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో వీటి కోసం రూ.1,803.01 కోట్లు కేటాయించారు. మంత్రుల ఖర్చుల కోసం రూ.828.36 కోట్లు తాజా బడ్జెట్‌లో కేటాయించగా, గత బడ్జెట్‌లో 1,289.28 కోట్లు కేటాయించారు. క్యాబినెట్ మంత్రులు, సహాయ మంత్రులు, మాజీ ప్రధానమంత్రుల జీతాలు, వినోదం, తదితర అలవెన్సుల కోసం ఈ సొమ్మును వినియోగిస్తారు. జాతీయ భద్రతా మండలి సచివాలయం కోసం గత ఏడాది (రూ.299.30 కోట్లు) కన్నా ఈ సంవత్సరం తక్కువ (రూ.202.10 కోట్లు) కేటాయింపులు జరిగాయి.

అణురంగంలోకి 'ప్రైవేటు'

న్యూఢిల్లీ: కట్టుదిట్టమైన ఆంక్షలు ఉండే అణురంగంలోకి ప్రైవేటు కంపెనీలను ఆహ్వానిస్తూ కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అణు రియాక్టర్ల ఏర్పాటు, చిన్న, మధ్యతరహా మాడ్యులర్ న్యూక్లియర్ రియాక్టర్లపై పరిశోధన వంటి వాటిలో ప్రైవేటు భాగస్వామానికి తలుపులు తెరిచింది. 2024 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ఈ మేరకు ప్రకటించారు. భారత స్మాల్ రియాక్టర్లు, భారత స్మాల్ మాడ్యులర్ న్యూక్లియర్ రియాక్టర్ల పరిశోధన, అభివృద్ధి, అణుశక్తికి సంబంధించి సరికొత్త సాంకేతికపై పరిశోధన, అభివృద్ధి విషయంలో ప్రైవేటు రంగంతో కలిసి నడవాలని నిర్ణయించినట్టు తెలిపారు. 'వికసిత్ భారత్'లో అణుశక్తి ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్‌అండ్‌టీ, గోద్రెజ్, వల్‌చంద్‌నగర్ ఇండస్ట్రీస్ వంటి ప్రైవేటు కంపెనీలు ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించి ఈ రంగంలో సేవలు అందిస్తున్నప్పటికీ ప్రభుత్వం వాటి పాత్రను పరిమితం చేసింది.

రక్షణ రంగానికి 6.21 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, జూలై 23: కీలకమైన రక్షణ రంగానికి బడ్జెట్‌లో నిధులు స్వల్పంగా పెంచారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.5.94 లక్షల కోట్ల మేర కేటాయింపులు జరుగ్గా.. తాజా 2024-25 బడ్జెట్‌లో కొంత పెంచి రూ.6,21,940 కోట్లు కేటాయించారు. మూలధన వ్యయాన్ని 1.72 లక్షల కోట్లుగా ప్రకటించారు. ఒక్క రక్షణ రంగానికి కేటాయించిన నిధులు.. మొత్తం బడ్జెట్‌లో 12.9 శాతం కావడం గమనార్హం. తాజా కేటాయింపులు రక్షణ రంగంలో స్వావలంబనకు మరింత బలం చేకూరుస్తుందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. 1.72 లక్షల కోట్ల మూలధన వ్యయం సాయుధ బలగాల సామర్థ్యాలను మెరుగుపరుస్తుందని అభిప్రాయపడ్డారు. సరిహద్దులో రోడ్ల నిర్మాణానికి సంబంధించి బీఆర్‌వోకు నిధులు కేటాయింపుపై రాజ్‌నాథ్ సింగ్ సంతోషం వ్యక్తం చేశారు. కాగా, సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరి 1 ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో రక్షణ రంగానికి రూ.6.21 లక్షల కోట్లనే కేటాయించారు.

ఆరోగ్య రంగానికి 90,958 కోట్లు

న్యూఢిల్లీ, జూలై 23: 2024-25 బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి రూ.90,958.63 కోట్లు కేటాయిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తెలిపారు. ఇది గత ఏడాదితో పోల్చితే 12.96 శాతం ఎక్కువ అని వెల్లడించారు. 2023-24లో కేంద్రం రూ.80,517.62 కోట్లు కేటాయించింది. మరోవైపు, మూడు క్యాన్సర్ మందులు ట్రాస్తుజుమాబ్ డెరుక్సెకాన్, ఒసిమెర్టినిబ్, దుర్వాలుమాబ్‌కు కస్టమ్ డ్యూటీ తొలగిస్తున్నట్టు ప్రకటించారు. అదేవిధంగా ఎక్స్‌రే మిషన్లలో వాడే ఎక్స్‌రే ట్యూబ్స్, ఫ్లాట్ ప్యానెల్ డిటెక్టర్స్‌పై బేసిక్ కస్టమ్ డ్యూటీని తగ్గిస్తున్నట్టు వివరించారు. ఆయుష్ మినిస్ట్రీకి రూ.3,712.49 కోట్లు కేటాయించినట్టు పేర్కొన్నారు.

ఈ-కోర్టులకు 1,500 కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న ఈ-కోర్టుల ప్రాజెక్టులో మూడో దశ కోసం 2024-25 ఆర్థిక సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో రూ.1,500 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కింది కోర్టుల్లో డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అప్‌గ్రేడ్ చేస్తారు. ఈ-కోర్టుల ప్రాజెక్టులోని మూడో దశను కేంద్ర క్యాబినెట్ గత ఏడాది సెప్టెంబరులో ఆమోదించింది. దీనికి రూ.7,210 కోట్లు ఖర్చవుతుందని తెలిపింది. అన్ని కోర్టుల్లోని అన్ని రికార్డులను డిజిటలైజ్ చేస్తారు. దీనికి నాలుగేళ్ల సమయం పడుతుందని అంచనా వేశారు. దీని కోసం రూ.2,038.40 కోట్లు ఖర్చవుతుందని, మొత్తం 3,108 కోట్ల డాక్యుమెంట్లను డిజిటలైజ్ చేయవలసి ఉంటుందని ఓ అధికారి చెప్పారు.

హోంశాఖకు 2,19,643 కోట్లు

- సింహభాగం పారామిలిటరీ బలగాలకే

న్యూఢిల్లీ, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో హోంశాఖకు రూ.2,19,643 కోట్లు కేటాయించారు. ఇందులో సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ లాంటి కేంద్ర పోలీస్ బలగాలకు దాదాపు రూ.1,43,276 కోట్లు ఇవ్వనున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన 2024-25 తాత్కాలిక బడ్జెట్‌లో హోంశాఖకు దాదాపు రూ.2,02,869 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. ప్రస్తుత పూర్తి స్థాయి బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని జమ్ముకశ్మీర్‌కు రూ.42,277 కోట్లు, లఢక్‌కు రూ.5,958 కోట్లు, అండమాన్, నికోబార్ దీవులకు రూ.5,986 కోట్లు, చండీగఢ్‌కు రూ.5,958 కోట్లు, దాద్రా, నగర్ హవేలీ, డామన్, డయ్యూకి రూ.2,649 కోట్లు, లక్షద్వీప్‌కు రూ.1,490 కోట్లు కేటాయించారు.

వివిధ కేటాయింపుల వివరాలు

సీఆర్‌పీఎఫ్	రూ.31,540 కోట్లు
బీఎస్ఎఫ్	రూ.25,472 కోట్లు
సీఐఎస్ఎఫ్	రూ.14,332 కోట్లు
ఐటీబీపీ	రూ.8,634 కోట్లు
సశస్త్ర సీమా బల్	రూ.8,882 కోట్లు
అస్సాం రైఫిల్స్	రూ.7,428 కోట్లు
ఇంటెలిజెన్స్ బ్యూరో	రూ.3,824 కోట్లు
ఢిల్లీ పోలీస్ విభాగం	రూ.11,180 కోట్లు
స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్	రూ.506 కోట్లు

గృహ నిర్మాణానికి 2.2 లక్షల కోట్లు

- పట్టణ పేద మధ్యతరగతి కోసం కోటి ఇండ్ల నిర్మాణం
- పారిశ్రామిక కార్మికులకు అద్దె ఇండ్లు

న్యూఢిల్లీ, జూలై 23: బడ్జెట్‌లో కేంద్రం గృహ నిర్మాణానికి రూ.2.2 లక్షల కోట్ల ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ కింద వచ్చే ఐదేండ్లలో పట్టణాల్లోని 1 కోటి పేద, మధ్యతరగతి ప్రజల కోసం ఇండ్లు నిర్మించాలని టార్గెట్‌గా పెట్టుకున్నట్టు వెల్లడించింది. అదేవిధంగా తక్కువ వడ్డీరేటుకే గృహ రుణాలు అందించనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తెలిపారు. ఇందుకు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు వెల్లడించారు. పారిశ్రామిక కార్మికుల కోసం అద్దె ఇండ్లు, డార్మిటరీ తరహా వసతి ఏర్పాట్లు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. దీన్ని ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా చేపట్టనున్నామని తెలిపారు.

విభజన హామీలు పట్టవా?

- కేంద్రం తీరుపై తెలంగాణ సమాజం మండిపాటు

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): కేంద్ర బడ్జెట్‌లో మరోసారి తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం అంటే అది కేవలం ఏపీకి సంబంధించినది కాదని, అది తెలంగాణ వల్ల ఉత్పన్నమైన చట్టమని కేంద్రం గుర్తించకపోవడం దారుణమని రాష్ట్ర ప్రజలు భగ్గుమంటున్నారు. బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కనీసం తెలంగాణ పేరును కూడా ప్రస్తావించకపోవడం పట్ల తెలంగాణ సమాజం మండిపడుతున్నది. గిరిజన విశ్వవిద్యాలయం, బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ, కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ, ఐఐఎం ఏర్పాటు సహా అనేక అంశాలను పరిష్కరిస్తామని కేంద్రం విభజన చట్టంలో తెలంగాణకు హామీ ఇచ్చింది. కాళేశ్వరం, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుల్లో కనీసం ఒక్కదానికైనా జాతీయ హోదా కల్పించాలని తెలంగాణ ఆవిర్భవించినప్పటి నుంచి కోరుతున్నది. అయినప్పటికీ కేంద్రం తెలంగాణకు ఏ అంశంలోనూ భరోసా ఇవ్వకపోవడంపై సామాజిక మాధ్యమాలలో పౌరులు భగ్గుమంటున్నారు. రాష్ట్రం పట్ల కేంద్రం వివక్షాపూరిత వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొన్ననే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని నెటిజన్లు దుయ్యబడుతున్నారు.

ఉపాధి హామీకి మొండిచెయ్యి: వ్యకాస

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ) : గ్రామీణ పేదల ఆహార భద్రతకు, ఉపాధి హామీ పనులకు కేంద్ర బడ్జెట్ మొండిచెయ్యి చూపిందని, ఇందుకు నిరసనగా బుధ, గురువారాల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తున్నట్టు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ప్రకటించింది. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలు, రైతులకు రాయితీలను కుదించి బడా కార్పొరేట్లకు ప్రకటించడం ఆందోళన కలిగిస్తున్నదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకటరావు అన్నారు. ఆహార పదార్థాల ధరలు 3.5 శాతం నుంచి 7.5 శాతం పెరిగాయన్న ప్రభుత్వం, వాటి నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని, పైగా తెల్లరేషన్ కార్డుదారులకు ఇచ్చే ఆహార సబ్సిడీకి గతేడాది రూ.2.12 లక్షల కోట్లు కేటాయిస్తే ఈసారి రెండు లక్షల ఐదు కోట్లకు తగ్గించారని చెప్పారు. ఉపాధి హామీకి గతేడాదిలానే రూ.86 వేల కోట్లు కేటాయించడమంటే వలసల నివారణపై కేంద్ర ప్రభుత్వానికి ఏమేరకు చిత్తశుద్ధి ఉన్నదో తెలిసిపోతున్నదని విమర్శించారు. మధ్యాహ్న భోజన పథకానికి నిరుడు రూ.21,527 లక్షల కోట్లు కేటాయిస్తే, ఈసారి రూ.21,200 లక్షల కోట్లకు కుదించారని తెలిపారు.

కేంద్రం పక్షపాతం: ఎంసీపీఐ (యూ)

బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం పక్షపాత ధోరణి అవలంబించిందని ఎంసీపీఐ (యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ విమర్శించారు. మంగళవారం జరిగిన రాష్ట్ర కమిటీ రెండో రోజు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా రాష్ట్రాల ఆదాయం ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని చెప్పారు. బీజేపీ పాలిత, బీజేపీకి మద్దతిస్తున్న రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించి, ఇతర రాష్ట్రాలకు అరకొర కేటాయించటం రాజ్యాంగ స్ఫూర్తిని పూర్తిగా దెబ్బకొట్టడమేనని విమర్శించారు. 70శాతం ఉన్న వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో 40 శాతం నిధులు కేటాయించాల్సి ఉంటే రూ.1.52 లక్షల కోట్లతో సరిపెట్టారని చెప్పారు. విద్యారంగానికి 30 శాతం కేటాయించాల్సి ఉంటే కేవలం రూ.1.48 లక్షలే ఇవ్వడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఈ బడ్జెట్ నోట్లో బెల్లం పెట్టి.. కంట్లో కారం కొట్టిన చందంగా ఉందని ఎద్దేవా చేశారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, కార్యదర్శి వర్గ సభ్యుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి, వనం సుధాకర్, కుంభం సుకన్య, పరికుప్పల వెంకన్న పాల్గొన్నారు.

2.62 లక్షల కోట్లతో రైల్వే పద్దు

- భద్రతకు 1.08 లక్షల కోట్ల ఖర్చు
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 23: కొత్త బడ్జెట్‌లో కేంద్రం భారతీయ రైల్వేకు రూ.2.62 లక్షల కోట్లు కేటాయించింది. రైల్వే అనే పదాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన 83 నిమిషాల బడ్జెట్ ప్రసంగంలో ఒక్కసారి మాత్రమే పలకడం గమనార్హం. రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాతో మాట్లాడుతూ ఇంతటి భారీ కేటాయింపులు గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. మొత్తం కేటాయింపుల్లో రూ.1.08 లక్షల కోట్ల నిధులను రైల్వే భద్రత వ్యవస్థల మెరుగు, రైల్వే మార్గాల్లో కవచ్ వ్యవస్థ ఇన్‌స్టాలేషన్‌కు వినియోగించనున్నట్టు తెలిపారు. ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ వ్యవస్థ 'కవచ్' ఇన్‌స్టాలేషనే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతల్లో ఒకటని చెప్పారు. రైల్వే భద్రతా చర్యల్లో భాగంగా పాత ట్రాకుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామని, అదేవిధంగా సిగ్నలింగ్ వ్యవస్థ మెరుగుపరుస్తామని, రైల్వే ఓవర్, అండర్ పాస్ బ్రిడ్జీలను నిర్మిస్తామని, కవచ్ వ్యవస్థను ఇన్‌స్టాల్ చేస్తామని అశ్విని వైష్ణవ్ తెలిపారు. కవచ్ 4.0 ఇటీవలిని ఆమోదం పొందిందని, ఇన్‌స్టాలేషన్‌ను త్వరితగతిన చేపడుతామని పేర్కొన్నారు.

కోచ్ ఫ్యాక్టరీ లేదు..కొత్త ప్రాజెక్టులు లేవు

- ఎస్‌సీఆర్ ఎంప్లాయీస్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కొత్త రైల్వే ప్రాజెక్టులు, కాజీపేట్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఊసే లేకుండా పోయిందని ఎస్‌సీఆర్ ఎంప్లాయీస్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు అభిప్రాయపడ్డారు. రైల్వే ప్రాజెక్టుల విషయంలో తెలంగాణ ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరిగిందని మండిపడ్డారు. రైల్వే అభివృద్ధికి దాదాపు 3,00,000 ఉద్యోగాల భర్తీకి పోస్టులు మంజూరు కావాల్సి ఉన్నదని, కేంద్ర బడ్జెట్‌లో అలాంటి ప్రస్తావన ఏదీ లేకుండా పోయిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, రైల్వే ఉద్యోగులకు సంబంధించిన 8వ వేతన సంఘం ప్రస్తావన కూడా బడ్జెట్‌లో లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.

ట్రిపుల్ ఆర్ ప్రస్తావనేది?

- బడ్జెట్‌లో ఊసేలేని రాష్ట్ర రోడ్లు
- టెండర్ల ప్రక్రియ ఎప్పుడు మొదలయ్యేనో?

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు వరాల జల్లు కురిపించిన కేంద్రం తెలంగాణకు మాత్రం అన్ని రంగాల్లోనూ నిరాశనే మిగిల్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రాంతీయ రింగురోడ్డు (ట్రిపుల్ ఆర్) ప్రస్తావన బడ్జెట్‌లో లేకుండా పోయింది. సుమారు రూ.30 వేల కోట్లకుపైగా ఖర్చవుతున్న ఈ ప్రాజెక్టు ఉత్తర భాగం భూసేకరణ చివరిదశకు చేరుకోగా త్వరలో టెండర్ల ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. ట్రిపుల్ ఆర్ మొత్తం 346 కిలోమీటర్ల పొడవు కాగా, దీన్ని ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించి పనులు చేపడుతున్న విషయం విదితమే. జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో ఈ రోడ్డును నిర్మిస్తుండగా, భూసేకరణ వ్యయంలో సగభాగం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది. భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్న ఉత్తర భాగం 164 కిలోమీటర్లకు 90 శాతం వరకు భూసేకరణ పూర్తయింది. దీనికి టెండర్లు పిలిచి పనులు చేపట్టాల్సి ఉంది. కాగా, వికసిత్ భారత్ ప్రాజెక్టులో చేపట్టనున్న దక్షిణ భాగం 182 కిలోమీటర్లకు కూడా ఇదివరకే కేంద్రం ఆమోదం తెలిపింది. అలైన్‌మెంట్ ఖరారైతే ఈ భాగానికి కూడా భూసేకరణ చేపట్టాల్సి ఉంటుంది. భూసేకరణను వ్యతిరేకిస్తూ కొన్నిచోట్ల రైతులు ఆందోళన చేయడం, కోర్టులో కేసులు వేయడంతో భూసేకరణ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో రైతులకు నష్టపరిహారం చెల్లింపులో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ రహదారుల అథారిటీ చైర్మన్‌కు విజ్ఞప్తిచేశారు. కానీ బడ్జెట్‌లో ట్రిపుల్ ఆర్ ఊసే లేకుండాపోయింది. ట్రిపుల్ ఆర్ పనులకు సంబంధించి బడ్జెట్‌లో ప్రస్తావిస్తారని అందరూ ఆశించినప్పటికీ కేంద్రం వారిని నిరాశకు గురిచేసింది. దీంతో ట్రిపుల్ ఆర్ భూసేకరణ ఎప్పటికి పూర్తవుతుందో, టెండర్ల ప్రక్రియ ఎప్పుడు మొదలవుతుందో అనేది అంతుబట్టకుండా మారింది.

10 లక్షల వరకూ విద్యా రుణాలు

- దేశీయ సంస్థల్లో ఉన్నత విద్య చదివేవారికే..

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): దేశీయ విద్యా సంస్థల్లో ఉన్నత విద్య కోసం విద్యార్థులకు రూ.10 లక్షల వరకు రుణాలు అందించనున్నట్టు కేంద్రం ప్రకటించింది. దీని కోసం ఏటా లక్ష మంది విద్యార్థులకు ఈ-వోచర్లు అందజేస్తామని వెల్లడించింది. రుణ మొత్తంలో 3 శాతం వడ్డీ రాయితీ ఇవ్వనున్నట్టు వివరించింది. అయితే, ఉన్నత విద్య చదివే విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తామన్న కేంద్రం.. ఉన్నత విద్యాసంస్థలైన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), ఐఐటీలు, టాప్ బిజినెస్ స్కూల్స్‌కు ఇచ్చే నిధుల్లో మాత్రం కోత విధించింది. కిందటేడాది యూజీసీకి రూ. 6,409 కోట్లు కేటాయిస్తే, ఈసారి 60.99 శాతం మేర తగ్గించి కేవలం రూ. 2,500 కోట్లు మాత్రమే విదిలించింది. టాప్ బిజినెస్ స్కూల్స్‌గా పేరున్న ఐఐఎంలకు (రూ. 212 కోట్లు), ప్రతిష్ఠాత్మక టెక్ సంస్థలు ఐఐటీలకు (రూ. 10,324 కోట్లు) కూడా నిరుడితో పోలిస్తే నిధుల్లో కోత విధించింది.



మేడిగడ్డ బరాజ్‌లో దిగువకు వెళ్తున్న వరద నీరు

జూరాలకు 1.65 లక్షల క్యూసెక్కుల వరద

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ ఉప్పొంగ